"వీల్లేదు ....ఇప్పుడే చెప్పాలి..."

"ఒకవేళ మీ ఊరు వెళ్ళటానికి వీల్లేదు అంటే."

"కేర్ చెయ్యకుండా వెళ్ళిపోతాను."

"అంత కేర్ చెయ్యనపుడు వెళ్తూ ఓమాట చెప్పొచ్చుగా అనుమతి కోసం నన్నడగడం దేనికి."

ఆ నవ్వేమిటి...

తనింత ఆరడి చేస్తున్నాఇంత నిర్మలంగా ఎలా నవ్వగలుగుతున్నాడు.

ఎంతకీ అంతుపట్టని ఈ మనిషి సామాన్య మైన సెంటిమెంట్స్‌కి అతీతుడా...

ఆమె అలా ఆలోచిస్తుండగా అతడు తన గదిలోకి వెళ్ళిపోయాడు.

రేపు ఎలాగైనా ఊరెళ్ళాలి... ఊరికనే అన్నా తన పంతం నెగ్గించుకోవాలి... పైగా ఒంటరితనంతో పిచ్చెక్కిపోతోంది.

గట్టిగా నిర్ణయించుకుని తనగదికి వెళ్ళింది.

స్ప్రింగ్ కాట్‌పై అటూ ఇటూ పొర్లుతూ చాలాసేపు గడిపింది.... అతడికి వినిపించాలని... అతడ్ని మరీ రెచ్చగొట్టాలని.....

ఎప్పుడో వేకువజామున నిద్రపట్టింది.

లేచేసరికి ఉదయం తొమ్మిదయింది.

అదరాబాదరాగా కాలకృత్యాలు ముగించుకొని బయటకు వచ్చేసరికి కిరీటి ఆఫీసుకు వెళ్ళిపోయాడు.

ఉబుసు పోవటం లేదు.

తన ప్రయాణం సంగతి పట్టించుకోకుండా ఆఫీసుకు వెళ్ళిన కిరీటిపై క్షణక్షణానికి ఎక్కువౌతుంటే ఫోన్‌లో దులిపేయాలనిపించింది.

ఫ్యాక్టరీ విజిటింగ్ వెళ్ళారని సీట్‌లో లేరని భూషణ్ సమాధానం చెప్పగానే రిసీవర్ బ్రద్దలు చేయాలన్నంత ఆవేశం వచ్చింది.

ఏదో గుర్తుకొచ్చినట్టుగా లేచి తన దగ్గర ఉన్న తాళాల గుత్తితో కిరీటి ప్రైవేటు రూం తెరవాలని ప్రయత్నించింది.

ఎంతకీ ఫలించకపోవటంతో ఆ గది తాళం దొరుకు తుందేమోనన్న ఆశతో కిరీటి బెడ్‌రూంలోని సొరుగులన్నీ వెతికింది. ప్రయోజనం లేకపోవటంతో నీరసంగా వెళ్ళి సోఫాలో కూర్చుంది చాలా సేపు.

భోజనాల వేళ మళ్ళీ ఫోన్ చేసింది.

ఈసారి కిరీటి ఫోన్ అందుకున్నాడు.

"ఏమిటి మీ ఉద్దేశం...." సీరియస్‌గా ప్రశ్నించింది.

"దేని విషయంలో" తాపీగా సమాధానం వినిపించింది అటువేపునించి

"నా ప్రయాణం గురించి రాత్రే మీకు చెప్పాను"

"నేను కాదంటే కేర్ చెయ్యకుండా వెళ్ళిపోతానని కూడా అన్నావు."

అతి స్థిమితంగా జవాబులిస్తున్న కిరీటి వ్య క్తిత్వం ఆమెకు అంతుపట్టటం లేదు.

"నేను నిజంగా వెళ్ళిపోతాను..." ఉడికిస్తున్నట్టుగా అంది.

"అవసరమైతే కారు తీసుకెళ్ళు...." అతడి వైఖరికి ఉక్రోషం మరింతగా పెరిగింది.

వెళ్ళవద్దని ప్రాధేయ పడతాడని, తను లేకపోతే బోరు కొడుతుందని బాధపడతాడని అనుకుంటే ఇలా మాట్లాడతాడేం.... తనేమన్నా అతని వ్యవహారాలకు అడ్డువస్తోందా? భార్యకంటే అతనికి బిజినెస్ ఎక్కువా..?

"చెప్పిన పని చెయ్యకపోతే నాకు మాహా వళ్ళుమంట. సరిగ్గా డ్రాఫ్టుచేసి తీసుకురండి...గెటవుట్ "

అవతలి ప్రక్క ఎవర్నో బ్లాస్ట్ చేస్తున్నట్టున్నాడు కిరీటి ....

"నామీద మంట ఎవరిమీదో చూపిస్తున్నట్టున్నారు."

"ఇది బిజినెస్‌కి సంబంధించి----"

"అంతే మీకు అదే ముఖ్యం------"

"శిల్పా..." అతడి గొంతులోని మార్దానికి విచలితురాలైనట్టుగా ఉండిపోయింది.

"ఫేక్టరీలో ఉత్పత్తి తగ్గితే పది రకాల ప్రణాళికలు వేసి అనుకున్నది సాధించగలను. కానీ మారనని మొండికేసే మనుష్యుల మెదడుల్ని ట్రాన్స్‌ప్లాంట్ చేయలేను....."

ఆమాట సరిగ్గా తనను ఉద్దేసించి అన్నాడన్న ఆలోచన రాగానే ఆమెకు కళ్ళనీళ్ళు పర్యంతమైంది.

"మీరామాట ఎందుకన్నారో నాకు తెలుసు..."

"తెలిసి తెలియనట్టు ప్రవర్తిస్తే వాళ్ళగురించి అరబ్బీలో ఓ అందమైన సామెత ఉంది."

"ఏమిటో అది" ఎగతాళిగా అడిగింది.

"హి హూ నోస్ ఎండ్‌నోస్ నాట్ హి నోస్ యీజ్ ఎస్లీప్--వేక్ హిమ్ అప్."

"హి అంటూ వాళ్ళు ప్రత్యేకించి చెప్పింది మీలాంటి మాగాళ్ళగురించి..."

"ఇలా మాట్లాడే వాళ్ళను తెలుగులో ఏమంటారో తెలీదుగానీ ఇంగ్లీషులో హిపోక్రట్స్ అంటారు."

"అంత పెద్ద పదాలకి అర్థం తెలియటానికి మీలా నేనేం ఎమ్ బి యెని కాను... వట్టి బియ్యే గ్రాడ్యుడేట్‌ని."

కోపంగా ఫోన్ పెట్టేసింది.

అతడు తనని కావాలని అవమానించాడన్న భావంతో కొన్ని క్షణాలు మనిషి కాలేకపోయింది.

ఎప్పుడూ ఏది పట్టించుకోకుండా ఎంతో గుంభనంగా ఉండే అమ్మగారు హఠాత్తుగా ఎందుకిలా ప్రవర్తిస్తున్నదీ ఎవరికీ అర్థంకాక బిక్కమొహాలు వెసుకొని తలా ఓమూల చేరిపోయారు.

ఇల్లు పీకి పందిరి వేయాలన్నంత కోపంతో డ్రైవర్ కోసం కబురు పెడితే అతడు కొడిక్కి బాగోలేదని ఇంటికి వెళ్ళాడని అయ్యగారికి చెప్పాడని నౌకరు చెప్పగానే కిరీటి మీద మరింత కోపం వచ్చింది.

తను ఊరుకి వెళ్ళకుండా చేయటానికి ఇంత పన్నాగం పన్నాడని తలపోయింది.

అయినా తను వెళ్ళగలదు... అతనికో మంచి గుణపాఠం చెప్పగలదు. హడావుడిగా ముస్తాబై పోయింది.

మనసులో ఏమారుమూలో కిరీటి వచ్చాక అతడు చూస్తుండగానే వెళ్ళాలన్న దుగ్ధ... అందుకే అలంకరణతోనే అయిదు గంటలవరకూ గడిపేసింది.

ఇంటికి వచ్చేసరికి అందంగా అలంకరించుకుని రెడీగా వున్న శిల్ప కనిపించగానే రెప్పవేయకుండా చూస్తూ ఉండిపోయాడు కిరీటి...

కాంక్ష నిండిన అతడి చూపుల వాడికి తట్టుకోలేనట్టుగా తల తిప్పుకుంటే అతడి పెదవులు మృదువుగా విచ్చుకున్నాయి.

అతడి ప్రవర్తన చూస్తుంటే గోళ్ళతో గిచ్చి రక్కేయాలన్నంత కోపం వచ్చిందామెకు.

"గీత్‌లో మంచి ఇంగ్లీషు పిక్చరు ఆడుతోంది" కోటు హేంగర్ కి తగిలిస్తూ గోడతో చెబుతున్నట్టుగా అన్నాడు.

"నేను వెళ్తున్నాను...."

"ఒంటరిగా ఏం బాగుంటుంది...ఇద్దరమూ వెళ్దాం...."

"జోక్స్‌చాలు.... నేను వెళ్తానన్నది పిక్చర్‌కి కాదు. ఊరికి."

"ఓహ్..."

స్ప్రింగ్‌కాట్‌పై బోర్లా పడుకుని ఆమెనే ఆపాదమస్తకం చూస్తూ "కాని ఈవేళలోనా..." అన్నాడు. ఆశ్చర్యాన్ని ముఖానికి పులుముకుని.

"మా ఊరు కేవలం ఇరవై మైళ్ళ దూరంలో మాత్రమే ఉంది.. ఇప్పుడు బయలు దేరితే ఓ గంటలో చేరిపోవచ్చు..." నిశ్చలంగా అంది.

"నిజమే కానీ కాస్త ముందు చెబితే కారు డ్రైవర్ని అరేంజ్ చేసే వాడ్నిగా...."

"నాటకాలు చాలించండి. నేను ముందు చెప్పలేదా.."

"చెప్పావు గానీ ... ఫలానా టైం అంటూ స్పష్టంగా అనలేదుగా. అందుకని డ్రైవర్ కొడుక్కి సీరియస్‌గా ఉందంటే లీవిచ్చి పంపేశాను."

కిరీటి అంత సీరియస్‌గా సిన్సియర్‌గా చెబుతుంటే అబద్ధం అనుకోలేకపోయింది.

"అయినా మరో డ్రైవర్‌నయినా అరేంజ్ చేయటం నాకు ఇబ్బందికాదు...." సాలోచనగా అన్నాడు.

"మరి జాప్యం ఎందుకట?"

"నువ్వు వెళ్ళటం నాకు ఇష్టం లేదు కనుక...."

అతడి కంఠంలో ప్రతిధ్వనించిన దృఢ నిశ్చయాన్ని గుర్తించిన శిల్ప సీరియస్‌గా అతనివైపు అతనివేపు చూసింది.

"అంతా మీ ఇష్టమే అనుకుంటున్నారా?"

"లేదు....." టపీమని జవాబిచ్చాడు.

"మరో వారం రోజుల్లో ఫాక్టరీ వార్షికోత్సవముంది. ఉద్యోగులంతా కలిసి ఏవో సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహిస్తారు. ప్రైజ్ డిస్ట్రిబ్యూషన్ నీ చేతుల మీదుగా జరగాలని ఫైనాన్స్ వింగ్ వాళ్ళు అడిగితే కాదనలేక పోయాను. నా భార్యగా కాకపోయినా వాళ్ళ యజమానురాలిగా వాళ్ళ కోర్కెను మన్నిస్తావని నీ అనుమతి లేకుండా మాటిచ్చేశాను. అందులోనూ మన వివాహం అయ్యాక ఎంప్లాయిస్ చేసే మొదటి ఫంక్షను....."

సంజాయిషీ ఇస్తున్నట్టుగా అంతా చెప్పిన కిరీటికి ఆమె నుండి అనుకూలమైన జవాబును కోరుకుంటున్నట్టుగా చూడటంతో అతడి మాటల్ని మనసు చేయకుండా కొన్ని క్షణాలు అలా నిలబడింది.

అతడి ఆర్ద్రింపుతో ఆమె అహంకూడా కాస్త శాంతించటంతో మారు మాట్లాడకుండా సూట్‌కేస్‌తో సహా తన గదిలోకి నడిచింది.

"గుడ్ గాడ్..."

తుఫాను నెదుర్కోవాల్సిన అవసరం తప్పినందుకు మనసులోనే ఆమెకు అభినందనలు చెప్పుకున్నాడు.

మూడు రోజులు గడిచాయి.

ఎక్స్‌పోర్టు మెషిన్స్ ట్రయిల్స్ కోసమని అల్జీరియానుండి కస్టమర్స్ రావటంతో కిరీటి చాలా రాత్రి వరకూ ఫాక్టరీలోనే గడిపేస్తున్నాడు.

ఫాక్టరీ యజమానిగా సుఖపడే అవకాశాలెన్నున్నా వ్యాపారాన్ని వృద్ధి చేయటమే ప్రథమ లక్ష్యంగా రేయింబవళ్ళు యంత్రంలా పనిచేసే కిరీటిపై హఠాత్తుగా జాలికూడా కలుగుతుండేది.

నాలుగవ రోజు ఆమె ఊహించని విధంగా జయశ్రీ ఆమె దగ్గరకు వచ్చింది.

అది మధ్యాహ్నం రెండు గంటలవేళ కావటంతో కిరీటి ఇంటిదగ్గర లేడు.

ఏ బాదరబంధీ లేనట్టుగా తాపీగా కూర్చుని పుస్తకం చదువుకుంటున్న శిల్పను చూడగానే ఎందుకో ఈర్ష్య కలిగింది.

పైగా యీ మధ్య ఫోన్ సైతం కిరీటి చాలా ముభావంగా, ముక్తసరిగా మాట్లాడుతుంటే అదంతా శిల్ప మహిమేనని భావించటంతో ఆమెపై ఎలాగైనా అక్కసు తీర్చుకోవాలన్న కోర్కె కల్గింది.

అందుకే కిరీటి లేని వేళ చూసి మరీ వచ్చింది.

ఆమె రాగానే శిల్ప మొహంలో తారట్లాడిన అనుమానపు రేఖల్ని ఆమె గమనించకపోలేదు.

"ఏమిటి... పెళ్ళయ్యాక కిరీటి మరీ నల్లపూసై పోయాడు." క్రీగంట చూస్తూ స్ప్రింగ్ కాట్‌పై కూర్చుంది జయశ్రీ.

పడక గదిలోకి సరాసరి రావటమే కాకుండా భార్యాభర్తలకు మాత్రమే పరిమితమైన బెడ్ అధిరోహించి తీరుబాటుగా కబుర్లుకి ఉపక్రమించింది.

'ఇది ఆమెకు సంస్కారమా లేక కిరీటి ఇచ్చిన చనువా?' జుగుప్సగా పదేపదే ప్రశ్నించుకుంది శిల్ప.

అయినా కోపాన్ని దిగమ్రింగుకొని మర్యాదగానే మాట్లాడాలని నిర్ణయించుకుంది. కారణం కిరీటి గతం గురించి కొంతైనా తెలుసుకోవాలన్న జిజ్ఞాస.

"ఏముందండీ... బిజినెస్ వ్యవహారాల్లో ఆయన ఈమధ్య మరీ బిజీగా ఉన్నారు." సాధ్యమైనంత సౌమ్యతగా జవాబిచ్చింది.

"ఇంతకు ముందు మాత్రం బిజీగా లేడూ... ఎంతరాత్రి వేళకైనా వచ్చి కొంతసేపైనా గడిపి వెళ్ళేవాడు. ఎంత థ్రిల్‌గా ఉందనుకునేరు..." క్రీగంట చూస్తూ శిల్పనే పరికించింది.

"పెళ్ళయ్యాక కూడా పూర్వంలాగే మీతో గడపాలంటే ఆయనకెలా కుదురుతుందండీ. అప్పుడంటే బ్రహ్మచారి కాబట్టి ఏదో మీ దగ్గర టైంపాస్ చేసేవారు."

కుంచించుకుపోయిన జయశ్రీ మొహం చూడగానే గట్టిగానే బదులు చెప్పాను అనుకుంది.

"మీరెన్ని చెప్పండి... మనమంతా కన్య తరవాతనే. కన్య అంటే కిరీటి మాజీ ప్రియురాలు. మళ్ళీ నేను అన్నట్టుగా అడిగేరు. కిరీటి నన్ను రేప్ చేసినంత పని చేస్తాడు. వస్తానండీ. అవతల బోలెడన్ని అపాయింట్‌మెంట్స్....

యుద్ధానికి కావలసిన సరంజామా సిద్ధం చేశానన్న తృప్తితో జయశ్రీ వెళ్ళి పోయింది.

కన్య...

ఆమెకు పేరు తెలిసింది... మిగతా వివరాలు తెలియాలి ...ఎలా?

ఆ రాత్రి ఆమెకు నిద్రపట్టలేదు.

అర్ధరాత్రి పన్నెండు గంటలవేళ చెక్ చేస్తే కిరీటి ప్రైవేట్ రూంలో కూర్చొని సీరియస్‌గా అదే ఫోటో ఆల్బమ్‌ను చూస్తున్నాడు.

దు:ఖం ముంచుకొచ్చిందామెకు...

రెండుగంటల వేళ మళ్ళీ మెలకువ వచ్చి చూస్తే ప్రైవేట్‌రూంలో కిరీటి ఇంకా అలాగే

కూర్చొని వున్నాడు.

ఏమిటి అంత ఆరాధన....?

అంత అభిమానం ఉన్నప్పుడు తననెందుకు కట్టుకున్నట్టు.

గతం మరపు రానిదైతే మళ్ళీ తన మెడలో ఉరిత్రాడు బిగించినట్టు...